క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన

ముదిగొండ: మండలంలోని ఖానాపురం, వెంకటాపురంలలో శనివారం జరుగుతున్న ఎస్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఎంపీడీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పంటకాలువల పూడికతీత పనులు, జంగిల్‌క్లీయరెన్స్ పనులు పరిశీలించారు. మండలంలోని 850మంది వివిధ పనుల్లో కూలీలు పాల్గొంటున్నారని తెలిపారు. కూలీలకు అడిగిన పనిని కల్పించాలని సిబ్బందికి సూచించారు.

టీపీఓ బదిలీ

వైరా: వైరా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధి కారి ఇటికాల భాస్కర్ బదిలీ అయ్యారు. గత రెండేళ్లగా ఇన్‌చార్జ్ టౌన్ ప్లానింగ్ అధికారిగా పని చేస్తున్న భాస్కర్ ఖమ్మం సుడా టౌన్ ప్లానింగ్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

ఆలయానికి విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న దృశ్యం

కారేపల్లి: కారేపల్లిలోని సుబ్బయ్యకుంట సమీపంలో నిర్మిస్తున్న గంగమ్మతల్లి దేవాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు పాలిక అయిలయ్య కుమారులు కొమరయ్య, లింగయ్య రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావు, మేకల మల్లయ్య, మేకల రమేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన మైనార్టీలు



పొంగులేటి చేతికి ఇమామ్-ఏ-జామిన్ కడుతున్న ముస్లింలు

ఖమ్మంమయూరిసెంటర్: మధిర నియోజకవర్గానికి చెందిన ముస్లిం, మైనార్టీలో శనివారం ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కలిసి నడుస్తామని ప్రకటించారు. ముస్లిం మైనార్టీ నాయకుడు ఎస్.కే. మియాభాయ్, డాక్టర్ కోటా రాంబాబు ఆధ్వర్యాన పలువురు పొంగులేటిని కలిసి మాట్లాడారు. భవిష్యత్‌లో పొంగులేటి ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని తెలిపారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

చింతకాని: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించి తహసీల్దార్ మంగిలాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై పొదిల వెంకన్నకు అందజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు గంటల వెంకటేశ్వరాచారి, ఉపాధ్యక్షుడు తొగటి కోటాచారి, ప్రధాన కార్యదర్శి గంటల అంజయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని బిల్లుపాడులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణార్జున్‌రావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కుటుంబరావు, వెంకటేశ్వరరావు, బిక్షం, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరు రూరల్: మండలంలోని వాచ్యా నాయక్ తండాకు చెందిన బానోత్ భద్రూ(30) గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడు. దీంతో శ్రీ బినిత మార్కెటర్స్ నిర్వాహకుడు బానోత్ చందులాల్ నాయక్, దంత వైద్యుడు నవీన్‌నాయక్‌లు కలిసి రూ.10,000లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందూలాల్, రాముడు, హరిప్రసాద్, వీర, శ్రీను, భద్రు, దశరథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 28 నుంచి క్విజ్ పోటీలు

కొణిజర్ల: ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొణిజర్ల మండలం సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి 6 నుంచి 9 తరగతులు చదువుతున్న బాలబాలికలు పాఠశాలకు ఐదుగురు చొప్పున పోటీలకు హాజరు కావాలన్నారు. వివరాలకు స్వరూపరాణి(9441506810), హనుమంతరావు (9866630271), సుబ్బారావు (9493217865), బిగ్ హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు (98491 04769)ను సంప్రదించాలన్నారు.

యాచకుడు మృతి

పెనుబల్లి: మండలంలోని గురవాయిగూడెంలో యాచకుడు శనివారం మృతిచెందాడు. ఆయన వడదెబ్బతో మృతి చెందాడా, అనారోగ్యం కారణమా అనేది తెలియరాలేదు. కాగా, మృతదేహాన్ని పెనుబల్లి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సూరజ్ తెలిపారు.

దాతల సాయంతో అల్పాహారం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల చదువుకు మరింత ప్రోత్సాహం
- పలువురి ప్రశంసలు అందుకుంటున్న ఎస్సై రామారావు

సండే స్పెషల్

కారేపల్లి: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులకు ఉదయం వెలల్లో కూడా అల్పాహారాన్ని అందించేందుకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావుతో పాటు పలువురు దాతలు సాయమందించి తమ గొప్ప మనసును చాటుకున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే ప్రక్రియలో భాగంగా కారేపల్లి మండలంలోని 7 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది చదువుతున్న 159 మంది విద్యార్థులకు అల్పాహారం అందించి వారి చదువు పట్ల మరింతగా ప్రోత్సహించే.. దిశగా వారు ఒక అడుగు ముందుకు వేశారు.

పేదరికం, మధ్యతరగతి కుటుంబాలు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల విద్యార్థులు దాదాపుగా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసిస్తున్నారు. తమ పిల్లలు బాగా చదువుకోవాలని, ప్రయోజకులు కావాలని వారి తల్లిదండ్రులు తపిస్తుంటారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న ఈ తరుణంలో.. వారికి ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోనే పాఠశాల ప్రారంభ సమయానికి ముందు ఉదయం, పాఠశాల విడిచిన అనంతరం సాయంత్రం వారికి ప్రత్యేక తరగతులను (స్టడీ అవర్స్) నిర్వహిస్తారు.

పది విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం..

కారేపల్లి మండలంలో కారేపల్లి, పేరుపల్లి, విశ్వనాథపల్లి, గేటుకారేపల్లి, కోమట్లగూడెం, బాజుమల్లాయిగూడెం, మాణిక్యారం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గాను 159 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి నిర్వహించే స్టడీ అవర్స్‌లో ఉదయం, సాయంత్రం వేలల్లో అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చారు. అనుకున్నదే తడవుగా.. 3 క్వింటాళ్ల ఉప్మా రవ్వ, 30 లీటర్ల మంచినూనె, ఇతర వంట సామగ్రిని పలువురు దాతలను ఆశ్రయించి అందజేశారు. దీంతో ఎస్సైని పలువురు అభినందిస్తున్నారు.



అల్పాహార మెటీరియల్ అందజేస్తున్న ఎస్సై రామారావు, ఎంఈఓ జయరాజు (ఫైల్)

ఆకలి అడ్డంకి కాకూడదు..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'ఆకలి'ఎప్పటికీ అడ్డంకి కాకూడదు. వారు చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారు. ప్రత్యేకంగా పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న ఈ తరుణంలో వారిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక తరగతుల సమయాల్లో వారికి అల్పాహారాన్ని బాధ్యతగా అందించాలి.

– పుష్పాల రామారావు, ఎస్సై, కారేపల్లి

విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం..



పోలీస్ వారితో పాటు పలువురు దాతలు ముందు కొచ్చి పది విద్యార్థులకు అల్పాహారం అందించటం అభినందనీయం. పేద విద్యార్థులను అన్ని విధాల ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధించి ప్రయోజకులు అవుతారు. కావున విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలి

– ఎం.శ్రీదేవి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, కారేపల్లి హైస్కూల్

ఆనందంగా ఉంది..



మా అమ్మానాన్నలు ఉదయం, సాయంత్రం వేళల్లో చేను పనుల్లో ఎక్కువ సేపు నిమగ్నం అవుతారు. నేము స్టడీ అవర్స్ టైంలో మార్నింగ్, ఈవెనింగ్ టైంలో స్నాక్స్ లాంటివి (అల్పాహారం) ఉండవు. ఇలాంటి సమయంలో ప్రభుత్వంతో పాటుగా.. దాతలు కూడా అల్పాహారానికి సహకరించడం ఆనందంగా ఉంది. మాలాంటి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న అందరికీ కృతజ్ఞతలు.

– నిఖిత, పదో తరగతి విద్యార్థి, కారేపల్లి హై స్కూల్

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



ఖైదీలతో మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి శివరామప్రసాద్

సత్తుపల్లిటౌన్: ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని 6వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ శివరామప్రసాద్ అన్నారు. శనివారం సాయంత్రం సత్తుపల్లి సబ్‌జైల్‌ను సందర్శించారు. జైలు జీవితంలో లభించే విరామ సమయంలో గతంలో చేసిన తప్పులను గుర్తు చేసుకుంటూ నేర ప్రవృత్తికి దూరమయ్యేలా, కుటుంబం కోసం జీవించేలా తమకు తాము పరివర్తన చెందాలన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తోందన్నారు. ఖైదీల యోగక్షేమాలను అడిగి వారికి అందుతున్న ఆహారం, వసతి, న్యాయ సహాయం తదితర వివరాలను ఆరాతీశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణస్వాతి, జైలు సూపరింటెండెంట్ ఎస్.ప్రవీణ్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

కల్లూరు: డబుల్ బెడ్‌రూం గృహాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్ష శనివారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. డబుల్ బెడ్‌రూం గృహాల వెనుక భాగంలో 30 కుంటల ఎన్నెస్పీ భూమిని కొంతమంది కబ్జా చేసుకున్నారని, ఆ భూమిని స్వాధీనం చేసుకుని నిరుపేదలైన అర్హులకు స్థలాలు కేటాయించాలని కోరారు. లేదంటే అమరణ దీక్షకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు జానీపాష, వెంకటరెడ్డి, బాధితులు ఉమామహేశ్వరి, కోటీశ్వరి, షకీల, ఉమర్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న మానవతారాయ్

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి..



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

వైరా: దేశంలో మేధావుల కొరత ఉందని.. ఆ లోటు భర్తీ కావాలంటే విద్యార్థులు లక్ష్యంతో చదువుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన 40వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ చదువుతున్న వారిలో 18 శాతమే ప్రపంచ దేశాల్లో అర్హత సాధిస్తున్నారని తెలిపారు. కాగా, బాలికలకు ఉన్నత విద్య అందిస్తూనే భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం బాలికలు ప్రదర్శించిన నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ అనిత, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మల్లెంపాటి వీరభద్రరావు, వైరా, ఏన్కూరు ప్రిన్సిపాళ్లు రమ, శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ వాసిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కొణిజర్ల: మండలంలోని తుమ్మలపల్లిలో పీఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో యువతకు శనివారం క్రికెట్ కిట్ అందజేశారు. పొంగులేటి యువ సైన్యం జిల్లా నాయకుడు ఎంపీపీ గోసు మధు, పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల పుల్లయ్య, పిట్టల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు గుండ్ల కోటేశ్వరరావు, గడల సాగర్, కనగంటి రావు, కె.మోష, నల్లమోతు లక్ష్మయ్య, రంజిత్, బండారు శ్రీను పాల్గొన్నారు.

ప్రీతిని వేధించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ నాయక్

పెనుబల్లి: వరంగల్ కేయూ మెడికల్ పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ ప్రీతిని వేధించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వీయంబంజర్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసులో పోలీసుల, హెచ్‌ఓడీ, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే సైఫ్ వేధింపులకు పాల్పడ్డాడని, ఆ కరణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రీతితో పాటుగా ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని, అందువలనే ఈ ఘోరం జరిగిందన్నారు. వేధింపులకు గురిచేసిన సైఫ్‌కు హోం మంత్రి అండదండలు ఉన్నాయని తెలపడంతో ఈ ఘాతకం జరిగిందని, వెంటనే హోమంత్రి మహ్మద్ అలీని పదవి నుంచి తొలగించి, సైఫ్‌ను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మసోతు ధశరత నాయక్, పెనుబల్లి మండల అధ్యక్షుడు రాంబాబు నాయక్, రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణ నాయక్, శివశంకర్ నాయక్, వెంకటేశ్వరరావు నాయక్, కేశవ నాయక్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు...

రైతు బంధు కన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: వైరా మండల రైతు బంధు సమితి కన్వీనర్‌గా మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన యరమల రవీందర్‌రెడ్డిని నియమిస్తూ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా 'ఏలూరి'..



కొణిజర్ల: బీఆర్‌ఎస్ కొణిజర్ల మండల ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని సింగరాయపాలెంకు చెందిన ఏలూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. శనివారం వైరా క్యాంపు కార్యాలయంలో శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వైరా: మండలంలోని రెబ్బవరం గ్రామంలో ముస్లింలకు ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలని శనివారం ముస్లింలు ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు వినతిపత్రం అందించారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఎంపీపీ వేల్పుల పావని సమక్షంలో వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు మద్దెల రవి, నాయకులు పసుపులేటి మోహన్‌రావు, కట్టా కృష్ణార్జునరావు, మచ్చా వెంకటేశ్వరరావు, డాక్టర్ కోటయ్య, రెబ్బవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ఫోరం ఏర్పాటు

తల్లాడ: మండలంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు శనివారం ఫోరం ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఫోరం తల్లాడ మండల అధ్యక్షుడిగా బోడా శ్రీనివాస నాయక్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి వీరకృష్ణ, తల్లాడ పట్టణ అధ్యక్షుడిగా దిరిశాల వీరభద్రయ్య, పట్టణ ఉపాధ్యక్షుడిగా నారపోగు ప్రసాద్, మండల కోశాధికారిగా గుగులోత్ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా తేళ్లపుట్ట వెంకటనారాయణ, మండల కార్యదర్శిగా తేళ్లపుట్ల లాలయ్య, వెంకటేశ్వర్లు, మోదుగు రవికుమార్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా రావుల గోపయ్య గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు తమకు రూ.25,000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

వైరా: ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను శనివారం బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కాట్రావత్ మోహన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల స్నేహభావం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు బాసటగా సంక్షేమ ఫలాలు



మధిర: చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు

మధిర/బోనకల్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు తెలిపారు. మధిర తహసీల్‌లో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. అదే విధంగా బోనకల్ మండలంలోని గార్లపాడు గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సావిత్రికి రూ.60వేలు, చాగంటి గోపయ్యకు రూ.25 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకునేందుకు కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతా జయాకర్, ఎంపీపీ లలిత, తహసీల్దార్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, బీఆర్‌ఎస్ పార్టీ మండల,అధ్యక్ష కార్యదర్శులు చేబ్రోలు మల్లిఖార్జున్, నాగేశ్వరరావు, నాయకులు బందం శ్రీను, వేమూరి ప్రసాద్, బానోత్ కొండ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న గురుకుల పూర్వ విద్యార్థి సందీప్‌కుమార్

ఏన్కూరు: చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని ఖమ్మం ఉద్యానవనశాఖాధికారి, గురుకుల పూర్వ విద్యార్థి గుడిమళ్ల సందీప్‌కుమార్ తెలిపారు. స్థానిక గురుకుల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి లక్ష్య సాధన కోసం అందరు కృషి చేయాలన్నారు. నైతిక విలువలను అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు సూచించిన సన్మార్గంలో ప్రయాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, వేము రాజు, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలి

బోనకల్: రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు జక్కుల రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలుచేయలేదన్నారు. రుణమాఫీ చేయకపోవడం వలన బ్యాంక్‌ల్లో వడ్డీలు పెరిగి రైతులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ స్వేతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు యంగల ఆనందరావు, జక్కా నాగభూషణం, అమర్‌నాద్, ఆకెన పవన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ స్వేతకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్ రెడ్డి

మధిర: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. ప్రజా గోస – బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో భాగంగా మధిర పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, కేసీఆర్ రహస్య మిత్రులని, అందుకే తెలంగాణలో అధికారంలో లేని బీజేపీని విమర్శిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన శాసన సభ్యులను భద్రంగా కేసీఆర్‌గూటికి చేర్చుతున్నాడని అన్నారు. మూడుసార్లు శాసన సభ్యుడిగా గెలిచిన భట్టి జాలిముడి ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిపై పెదవి విప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం పురోగతి వేగంగా జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, కోనా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5న ఎలిజిబిలిటీ టెస్ట్



బండి పార్థసారథిరెడ్డి

సత్తుపల్లిరూరల్: మార్చి 5న సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో హెటిరో ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకుడు దాసరి ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 మంది విద్యార్థులకు రాజ్యసభ సభ్యుడు, హెటిరో అధినేత డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసనా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బండి అన్విద సహకారంతో ఇంజనీరింగ్ విద్యను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ.. ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో 380 మార్కులు ఉన్న విద్యార్థులు కళాశాలలో జరిగే ఈ టెస్ట్‌కు మార్కుల మెమో, గుర్తింపు కార్డుతో హాజరు కావాలని కోరారు. సాయిస్ఫూర్తి స్టూడెంట్ స్పాన్సర్‌షిప్ కార్యక్రమంలో ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నాలుగు సంవత్సరాల పాటు ఉచిత ఇంజనీరింగ్ విద్యను అందించటమే కాకుండా మొదటి సంవత్సరంలో జాయినింగ్ ఇన్సెంటీవ్ రూ.30వేలు ఇవ్వటం జరుగుతుందన్నారు. వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

సత్తుపల్లిరూరల్: చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్ అన్నారు. శనివారం మండలంలోని పలు ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు హెపటైటిస్–బి, డీపీటీ, పోలియో, మిజిల్స్, పెంటావాలెంట్, జేఈ వ్యాక్సిన్లు, గర్భిణులకు టీటీ ఇంజక్షన్లు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నర్సింహారావు, అన్నమ్మ, ఏఎన్‌ఎం మంజుల, శాంతిప్రియ, మౌనిక, రత్నకుమారి, లక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కాకర్లపల్లిలో చిన్నారికి టీకా వేస్తున్న దృశ్యం

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ ఫెయిర్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ కరుణాకర్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందాలంటే సైన్స్ ఫెయిర్ ఓ వేదికగా ఉపయోగపడుతుందని సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్ అన్నారు. ప్రతిష్టాత్మక నోబెల్ విజేత సీవీ రామన్ జయంతి(ఫిబ్రవరి 28)ని పురస్కరించుకొని శనివారం విశ్వశాంతి విద్యాలయంలో సైన్స్ ఫెయిర్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు 240 నమూనాలు, వర్కింగ్ మోడల్స్‌లను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సీఐ కరుణాకర్, సత్తుపల్లి అగ్నిమాపక అధికారి చంద్రశేఖర్‌రెడ్డి లు హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.